క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

దుర్గి: 33/11 కేవీ అగ్నిగుండాల ఫీడర్ ట్రీ కటింగ్, మెటీరియల్ మార్పు కారణంగా విద్యుత్ సరఫరా శుక్రవారం నిలిపివేయనున్నట్లు డీఈ ఎ.రామయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు కరెంట్ ఉండదని చెప్పారు. మండల పరిధిలోని ముటుకూరు, కోలగుట్ల సబ్ స్టేషన్ పరిధిలో వినియోగదారులు సహకరించాలని కోరారు.

కంచరగుంట యానాది కాలనీలో బోరు ఏర్పాటు

దుర్గి: గత కొన్ని రోజులుగా తీవ్ర తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్న కంచరగుంట యానాది కాలనీ వాసులకు స్థానిక వైఎస్సార్ సీపీ నేత నూతన బోరును ఏర్పాటు చేశారు. తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్న కాలనీ వాసులు సమస్యను ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆయన స్పందించి స్థానిక వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు మాదాసు వెంకటేశ్వర్లుకు నూతన బోరును ఏర్పాటు చేయాల్సిందిగా ఆదేశించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు కాలనీని సందర్శించి నూతన మోటార్‌ను తెప్పించి మూడు రోజులలోనే సమస్యను పరిష్కరించారు.

ప్రాథమిక పాఠశాలలో చేరిన చిన్నారులు

కారెంపూడి: అంగన్‌వాడీ కేంద్రాలలో ఐదేళ్లు నిండిన 12 మంది పిల్లలను అంగన్‌వాడీ టీచర్లు, తల్లిదండ్రులు గురువారం ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. కారెంపూడి సెక్టార్ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో 3 సంవత్సరాల నుంచి 5 ఏళ్ల వరకు పిల్లలకు ఆటపాటల ద్వారా కృత్యాధార బోధన చేస్తున్నామని ఇది పిల్లలలో అభ్యసనా సామర్థ్యాలను పెంచుతున్నామని దీనివల్ల వారు ప్రాథమిక పాఠశాలలో చేరి సమర్థవంతంగా విద్యాభ్యాసం చేసేందుకు వీలవుతుందని సూపర్‌వైజర్ అనంతలక్ష్మి పేర్కొన్నారు.

ఆటోను ఢీకొని.. ఆరుగురికి గాయాలు

దాచేపల్లి: ఆటోను తుఫాన్ వాహనం ఢీకొట్టిన ఘటన గురువారం చోటుచేసుకుంది. వివరాలు.. దాచేపల్లి నుంచి భట్రుపాలేనికి వెళ్తున్న ఆటోలో ఏడుగురు ప్రయాణిస్తున్నారు. మాదినపాడు నుంచి అతివేగంతో వస్తున్న తుఫాన్ వాహనం క్రాస్ రోడ్డు వద్ద ఆటోను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటో డ్రైవర్ భూక్యా రుప్లానాయక్‌తో ఇద్దరు తీవ్రంగా గాయపడగా నలుగురికి స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108లో గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఆటో డ్రైవర్ రూప్లానాయక్‌కు మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

భూసార పరీక్షతో రైతుకు రక్ష

రెంటచింతల: భూసార పరీక్ష చేయించుకోవడం వలన రైతులకు ఎంతో మేలు అని మండల వ్యవసాయాధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి అన్నారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతు భరోసా కేంద్రం సిబ్బందికి భూసార పరీక్షలపై గురువారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ 11 గ్రామాలలో ఈ ఏడాది మొత్తం 1,605 మట్టి నమూనాలను సేకరించాలని సూచించారు. గ్రామాలలోని రైతులకు మట్టి నమూనాలను సేకరించి భూసార పరీక్షలు చేయడం వలన కలిగే ప్రయోజనాలను వివరించి వారిలో చైతన్యం తీసుకురావాలన్నారు.

భూముల్లోకి గామాలపాడు గ్రామస్తులు

దాచేపల్లి: మండలంలోని గామాలపాడు గ్రామంలోని సొసైటీ భూముల్లో గురువారం చెట్లు తొలగించారు. హైకోర్టు ఆదేశాల మేరకు ఏళ్ల తరబడి సాగుచేసుకుంటున్నభూములు స్వాధీనం చేసుకుని బాగు చేసుకున్నామని గామాలపాడు గ్రామస్తులు తెలిపారు. సొసైటీకి చెందిన 75 ఎకరాలను 1910లోనే అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం తమ వారసులకు పట్టాలు ఇచ్చిందని, గత కొన్నేళ్ల క్రితం ఈ భూములను నాటి ఆంధ్రా సిమెంట్ యజమాన్యం అక్రమించుకుందని పేర్కొన్నారు. హైకోర్టు అనుకూలంగా తీర్పు ఇవ్వటంతో తాము భూములను స్వాధీనం చేసుకుని బాగు చేసుకున్నామని చెప్పారు. గ్రామస్తులు భూములు సాగు చేస్తున్నారనే విషయం తెలుసుకున్న ఫ్యాక్టరీ యజమాన్యం భూముల వద్దకు వెళ్లి గ్రామస్తులతో మాట్లాడారు. సమస్యను సామరస్యంగా పరిష్కరించుకునేలా చర్యలు తీసుకుంటామని యజమాన్యం ప్రతినిధులు హామీ ఇవ్వటంతో అక్కడ నుంచి గ్రామస్తులు వెళ్లిపోయారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

దుర్గి: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి తన ఇంట్లో ఇనుప దూలానికి చీరతో ఉరి వేసుకొని మృతి చెందిన ఘటన మండలంలోని ఓబులేశునిపల్లెలో గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన ముక్కరాల వీరాంజి(36) సెలూన్ షాపు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. భార్యాభర్తల వివాదం నేపథ్యంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, పాప, బాబు ఉన్నారు.

సర్కారు ఆణిముత్యాలను ప్రోత్సహిద్దాం

- విద్యారంగంలో విప్లవాత్మకమైన సంస్కరణలు
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- రెంటపాళ్లలో నియోజకవర్గ స్థాయిలో జగనన్న ఆణిముత్యాలు


విద్యార్థినికి పురస్కారం అందజేస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో తీసుకొచ్చిన విప్లవాత్మకమైన చర్యల్లో భాగంగానే ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు, కార్పొరేట్ పాఠశాలల కంటే అధికంగా ఉత్తీర్ణత సాధించారని, వారిని ప్రోత్సహించేందుకే జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండల పరిధిలోని రెంటపాళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నియోజకవర్గ స్థాయి జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి మండల విద్యా శాఖాధికారి ఏ శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ ఇది పేదల పక్షపాత ప్రభుత్వమని ఏ విద్యార్థి పేదరికంతో చదువుకు దూరం కాకుండా ఉండేందుకే మీ మేనమామ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం విద్యా రంగాన్ని బలోపేతం చేసి మీ అభివృద్ధికి కృషి చేస్తున్నారని చెప్పారు. నాడు- నేడు కార్య క్రమంతో పాఠశాలలకు మౌలిక వసతులు, వనరులు కల్పించి మెరుగులు దిద్దినట్లు వివరించారు. అనంతరం నియోజకవర్గస్థాయిలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన లక్కరాజుగార్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన గుత్తికొండ శివ మాధవరెడ్డి(ప్రథమ), కుంకలగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన నందిగామ జెస్సికా(ద్వితీయ), మాదల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన జీడిమల్ల వీరేంద్రకుమార్(తృతీయ) స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు వరుసగా రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు నగదు పురస్కారాలు, ప్రశంసా పత్రాలను అందించారు. అలాగే ఇంటర్మీడియెట్ ద్వితీయ ఏడాదిలో రాయపాటి సురేష్(హెచ్ఈసీ, సత్తెనపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల), రావులపల్లి పావని(ఎంపీసీ, నకరికల్లు కేజీబీవీ), షేక్ చాందిని(సీఈసీ, నకరికల్లు ఏపీఎమ్ఎస్), షేక్ సల్మా (బైపీసీ, రామకృష్ణాపురం గురుకులం) ప్రతిభ చూపిన నాలుగు గ్రూపుల్లో నలుగురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున నగదు పురస్కారాలను అందజేసి, ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ, పాకాలపాడు పీఏసీఎస్ అధ్యక్షుడు కొర్లకుంట వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని తహసీల్దార్‌కు వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న పాస్టర్లు

గురజాల: ప్రచారంలో ఉన్న పాస్టర్‌ను సంఘస్తులను అడ్డుకుని ఇష్టంవచ్చినట్లు మాట్లాడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ఎం.దానియేలుకు మండల పాస్టర్స్ అసోసియేషన్ సభ్యులు గురువారం వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ బుధవారం గురజాలలోని గాంధీబొమ్మ సెంటర్‌లో యెరుషలేము ప్రార్థనా మందిరం సంఘకాపరి పాస్టర్ వాసం డేవిడ్, సంఘస్తులను వాహనాన్ని అడ్డుకుని వాహన అద్దాలు పగులగొట్టిన సంఘటన చాలా బాధకరమన్నారు. వెంటనే వారిపై ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకుని పాస్టర్స్‌లకు సంఘస్తులపై ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు బి.రాజేష్, జె.జోజికుమార్, ఆదూరి మాణిక్యరావు పాల్గొన్నారు.

పత్తి పంట ఎర్ర బడటం నివారణకు చర్యలు


క్షేత్రస్థాయిలో పత్తి పంటను పరిశీలిస్తున్న ఏఓ అమీర్‌రెడ్డి

దుర్గి: వేసవి కాలంలో ముందస్తుగా సాగు చేసిన పత్తి పంటలో చెట్లు ఎర్రబడటం గమనించినట్లు వ్యవసాయాధికారి వై.అమీర్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని పోలేపల్లి గ్రామంలో గురువారం క్షేత్ర పర్యటన నిర్వహించారు. స్థానిక రైతులతో పత్తి పంటలను పరిశీలించి నీటి ఒత్తిడి, పత్తి మొక్కలు ఎర్రబడటం, పేనుబంక, పచ్చదోమ, రసం పీల్చు పురుగులు ఆశించినట్లు గుర్తించారు. పత్తి పంట ఎర్రబడటం వీటి నివారణకు మెగ్నీషియం సల్ఫేట్ 10గ్రాము ఒక లీటర్ నీటితో పిచికారి చేయాలన్నారు. నీటి ఒత్తిడిని తట్టుకునేందుకు 2గ్రా. యూరియా ఒక లీటర్ నీటితో పిచికారి చేయాలని సూచించారు.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ

పిడుగురాళ్ల: మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయటం అభినందనీయమని సీడీపీఓ జ్యోస్న మేరిగోల్డ్ అన్నారు. పట్టణంలోని శ్రీ దత్త సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ గార్లపాటి కృష్ణకాంత్, ఐసీడీఎష్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్లు పి. అంజలి, బి.అన్నపూర్ణ, కార్యాలయ సిబ్బంది సపంత్‌కుమార్, హాస్పిటల్ మేనేజర్ కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

ఆశ్రమానికి సిమెంట్ అందజేత

పిడుగురాళ్ల: పట్టణంలోని లెనిన్‌నగర్‌లో మదినా మహిళా మండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మదర్ థెరిస్సా ఆశ్రమ నిర్మాణానికి జానపాడు గ్రామానికి చెందిన తాళ్లపోగు వెంకట్రావు 30 సిమెంట్ బస్తాలు అందజేశారు. నిర్మాణానికి తన వంతుగా సిమెంట్ కట్టలను అందజేసినట్లు మదర్‌థెరిస్సా ఆశ్రమ నిర్వాహకురాలు షేక్ జమిలా తెలిపారు.

పేదలకు అన్నదానం


అన్నదానం చేస్తున్న గోవిందరెడ్డి

మాచర్ల: పట్టణంలోని పలు సంఘాల ఆధ్వర్యంలో గురువారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనాథలు, వృద్ధులు, యాచకులకు వివిధ ప్రాంతాలలో మొబైల్ వ్యాన్ ద్వారా స్వామి వివేకానంద, రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో బస్టాండ్, రైల్వే స్టేషన్, రింగురోడ్డు, నెహ్రూ నగర్, పాత మాచర్లలో కన్వీనర్ మెట్టు గోవిందరెడ్డి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

సత్యసాయిబాబా సేవా మందిరం ఆధ్వర్యంలో

పట్టణంలోని సొసైటీ కాలనీలోని సత్యసాయిబాబా సేవా మందిర్ ఆధ్వర్యంలో సాయి పాఠశాల నిర్వాహకులు జక్కా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రభుత్వాస్పత్రిలో రోగులు, సిబ్బంది 100 మందికి పైగా గురువారం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

అంగన్‌వాడీ సెంటర్లల్లో గ్రాడ్యుయేషన్ డే


పందిటివారిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ నిర్వహిస్తున్న సూపర్‌వైజర్లు

పిడుగురాళ్ల రూరల్: మూడు సంవత్సరాలు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని సెక్టర్ సూపర్‌వైజర్ ఎస్.నాగమణి అన్నారు. మండలంలోని పందిటివారిపాలెంగ్రామంలోని అంగనవాడీ కేంద్రంలో గ్రాడియేషన్ డే కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ప్రీ స్కూల్‌లోని మెటీరియల్‌ను ప్రదర్శించారు. తల్లిదండ్రులకు ప్రీ స్కూల్ విద్యపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించటం ద్వారా చదువుకునేందుకు బాటలు వేస్తామని, చిన్నారులు ఇంటి వద్ద ఉండకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని ఆమె అన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పి.అంజలి, కె.కోటేశ్వరమ్మ, ఎ.వెంకటలక్ష్మమ్మ, అన్నపూర్ణ, డీఈఓ లలిత, సంపత్‌కుమార్, అంగన్‌వాడీ నిర్వాహకులు భూలక్ష్మీ పాల్గొన్నారు.

పట్టణంలో..

పిడుగురాళ్ల: చిన్నప్పటి నుంచి విద్యార్థులు సాధించాల్సిన విజయాల గురించి తెలపాలని ఇన్‌చార్జి సీడీపీఓ జ్యోస్న మేరిగోల్డ్ తెలిపారు. పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో గురువారం ప్రీ గ్రాడ్యుయేషన్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ పాఠశాలలో చదివే విద్యార్థినీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పొందినట్లుగా డ్రస్ కోడ్‌ను ఏర్పాటు చేశారు. దీంతో చిన్నారులలో డిగ్రీ పట్టా పొందిన ఆనందాన్ని కల్పించారు.

సంక్షిప్త వార్తలు

నేడు జగనన్న ఆణిముత్యాలు

మాచర్ల: పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రభుత్వం తరఫున నిర్వహించనున్న జగనన్న ఆణిముత్యాల కార్యక్రమాన్ని రైల్వే గేటు పక్కనున్న జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించనున్నట్లు మండల విద్యా శాఖాధికారి వేముల నాగయ్య గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన కార్యాయంలో విలేకరులతో మాట్లాడుతూ నియోజక వర్గంలో 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను సత్కరించి నగదు బహుమతులు, మెమెంటోలను అందజేయనున్నట్లు తెలిపారు.

అగ్నిప్రమాదంలో జనరేటర్ దగ్ధం

మాచర్ల: పట్టణంలోని నాగార్జున కళామందిర్, డాక్టర్ వెంకటరెడ్డి బిల్డింగ్ సమీపంలోని ఎస్‌బీఐ ఏటీఎం ముందున్న జనరేటర్ అగ్ని ప్రమాదానికి గురి కావటంతో మంటలు రేగాయి. బ్యాంకు పక్కనే ఉన్న ఏటీఎం వద్ద మంటలు లేచిన విషయాన్ని పలువురు కేక వేయటంతో ఉద్యోగులు, సిబ్బంది, వినియోగదారులు బయటకు వచ్చారు. విషయాన్ని అగ్ని ప్రమాద కేంద్రానికి సమాచారం ఇవ్వటంతో వెంటనే అగ్నిమాపక సిబ్బంది రంగంలోకి దిగి మంటలు ఆర్పారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది.

రైతు భరోసా కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

మాచర్ల: మాచర్ల వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాలలో పచ్చిరొట్ట విత్తనాలు, జనుము, జీలుగ విత్తనాలు రైతు భరోసా కేంద్రాలలో అందుబాటులో ఉన్నట్లు వ్యవసాయ సహాయ సంచాలకులు జగదీష్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రైతుల అవసరాల కోసం గ్రామీణ రైతుల భరోసా కేంద్రాలలో అర్హత కలిగిన ప్రతి రైతు విత్తనాలతో పాటు, కౌలు రైతు సమాచారాన్ని ఆయా గ్రామ రెవెన్యూ అధికారులు రైతు భరోసా కేంద్రాలలో అందించాలన్నారు.

నేడు కారెంపూడిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

కారెంపూడి: కారెంపూడిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి.శ్రీనివాసరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కారెంపూడిలో ఏడో రోజు నిర్వహించే కార్యక్రమానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి హాజరవుతారని చెప్పారు. శ్రీ చక్ర సిమెంట్స్‌లో దీర్ఘ కాలం కార్మికులుగా పనిచేసిన వారికి ఇవ్వ సంకల్పించిన నివేశన స్థలాలను ఫ్యాక్టరీ యాజమాన్యం విన్నపం మేరకు ప్రభుత్వ విప్ పీఆర్కే చేతుల మీదగా పంపిణీ చేయనున్నట్లు వివరించారు.

విద్యుత్ తీగలు పడి మహిళకు గాయాలు

పిడుగురాళ్ల రూరల్: విద్యుత్ తీగలు తెగి మహిళపై పడి గాయాలైన ఘటన మండలంలోని కరాలపాడులో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. బీసుపోగు కుమారి రోజులాగానే ఉపాధి హామీ పనులకు వెళ్లి ఇంటికి వచ్చింది. ఇంటిల్లో పనుల నిమిత్తం బయటకు వచ్చిన సమయంలో విద్యుత్ స్తంభానికి ఉన్న పింగాణి పగిలి పోవటంతో స్తంభానికి ఉన్న 11 కేవీ విద్యుత్ వైర్ తెగి కుమారిపై పడ్డాయి. దీంతో కుమారి విద్యుత్ షాక్‌కు గురై ఉండటాన్ని స్థానికులు గమనించి విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించి విద్యుత్ ఆపివేసి వైర్లను తొలగించి కుమారిని పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

విద్యుదాఘాతంతో కార్మికుడికి గాయాలు

కారెంపూడి: మండలంలోని పెదకొదమగుండ్ల గ్రామంలో విద్యుదాఘాతానికి గురై ప్రైవేటు ఎలక్ట్రీషయన్ తీవ్రంగా గాయపడిన ఘటనే మండలంలోని పెదకొదమగుండ్ల గ్రామంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామ లైన్‌మెన్ ఆదేశాల మేరకు గ్రామానికి చెందిన ప్రైవేటు విద్యుత్ కార్మికుడు వర్ల సాగర్ స్తంభం ఎక్కి తీగలు తప్పిస్తుండగా సాగర్ విద్యుదాఘాతానికి గురై కింద పడ్డాడు. గాయపడిన సాగర్‌ను నరసరావుపేటలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వెన్నుముక భాగం దెబ్బతిందని తేలడంతో మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలించారు.

ఫర్టిలైజర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా మల్లారెడ్డి

మాచర్ల: పట్టణ ఫర్టిలైజర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా శీలం మల్లారెడ్డిని ఎంపికయ్యారు. స్థానిక కోదండ రామాలయంలో అసోసియేషన్ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు చుండూరు శ్రీనివాసరావు, అసోసియేషన్ నాయకులు పిన్నెల్లి హనిమిరెడ్డి, మేడం శివరామకృష్ణ, యరబోతుల కోటేశ్వరరావు, పోలా సత్యనారాయణ, కొత్త శ్రీను, మారం శ్రీను, విడేల శ్రీనివాసరావు, కాసుల వెంకటేశ్వర్లు, పుల్లారావు, శ్రీరామమూర్తి, విడేల కృష్ణమూర్తి, గాలేశ్వరరావు పాల్గొన్నారు.

20లోగా ఈకేవైసీ నమోదు చేసుకోవాలి

ముప్పాళ్ల: ప్రధానమంత్రి కిసాన్ యోజన లబ్ధి పొందేందుకు గాను ఈ కేవైసీ నమోదు కాని వారు ఈ నెల 20లోగా నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ తెలిపారు. మండలంలోని చాగంటివారిపాలెం ఆర్బీకేలో వైఎస్సార్ యంత్ర సేవ, మట్టి నమూనాల సేకరణలపై వీఏఏ, వీహెచ్ఏలకు గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండలంలో అన్ని గ్రామాల్లోను 1245 మంది ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉందన్నారు. 2023 ఏడాదికి గాను 93 మందికి పలు కారణాలతో నగదు జమ కాలేదన్నారు. వారంతా 17వ తేదీలోగా సమస్యలను పరిష్కరించుకునేలా చూడాలన్నారు. ఎక్కువగా ఆధార్, ఎంపీసీఐ మాపింగ్ లాంటి సమస్యలున్నాయని చెప్పారు. వీరంతా ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంక్‌లో ఖాతా తెరుచుకుంటే సరిపోతుందని వివరించారు. అర్హులైన ప్రతి కౌలు రైతుకు పంటసాగుపత్రం అందించాలని కోరారు. మట్టి నమూనాలు సేకరించాలని సూచించారు.

రిజిస్ట్రేషన్ సేవలు ప్రారంభం

సత్తెనపల్లి: మండలంలోని రెంటపాళ్ల గ్రామ సచివాలయంలో రిజిస్ట్రేషన్ సేవలను గురువారం ప్రారంభించారు. తహసీల్దార్ ఎస్.సురేష్ మండల జాయింట్ రిజిస్టర్ సత్తెనపల్లి, పంచాయతీ కార్యదర్శి, గ్రామ రెవెన్యూ అధికారి, రెంటపాళ్ల గ్రామ సర్వేయర్, హాజరై ఏకుల రోశయ్య తండ్రి నాగయ్యకు చెందిన భూమిని రిజిస్ట్రేషన్ పూర్తి చేశారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి


దాచేపల్లి ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు అందజేస్తున్న దృశ్యం

దాచేపల్లి: క్రమ శిక్షణతో కూడిన విలువైన విద్యను అభ్యసించాలని జెడ్పీటీసీ సభ్యుడు మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి అన్నారు. స్థానిక ఆదర్శ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు గురువారం పంపిణీ చేశారు. జెడ్పీటీసీ ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధనలో విన్నూతమైన మార్పులు ప్రభుత్వం తీసుకువచ్చిందని చెప్పారు. నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యార్థులకు అండగా ఉండి అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ మునగా పున్నారావు, వైస్ చైర్మన్ షేక్ ఖాదర్‌బాషా, పార్టీ పట్టణ కన్వీనర్ షేక్ సుభానీ, మాజీ కన్వీనర్ షేక్ జాకీర్‌హుసేన్, ఎస్ఎంసీ కమిటీ చైర్మన్లు నాళం శ్రీనివాసరావు, షేక్ సైదావలి, ప్రిన్సిపాల్ రవికుమార్, నాయకులు కుందురు తిరుపతిరెడ్డి, బొడ్డు నాగేశ్వరరావు, షేక్ డాడీ, ఐనాల శ్రీరాములు, మీసాల అచ్చయ్య పాల్గొన్నారు.

కారెంపూడిలో..

కారెంపూడి: విద్యార్థులకు అవసరమైన సకల సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తోందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొంగర సుబ్రహ్మణ్యం అన్నారు. మండలంలోని పేటసన్నెగండ్లలో గురువారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు జగనన్న కానుకలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఉన్నం ఆదిశేషగిరిరావు, వెన్నపూసల బుల్లిబ్బాయి, మాచర్ల ఏడుకొండలు, మామిడి శేఖర్ పాల్గొన్నారు.

పిడుగురాళ్ల: విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు వేస్తున్న నాయకుడు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కౌన్సిలర్లు మాదాల కిరణ్, షేక్ అబ్దుల్లా అన్నారు. పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యా కానుక పంపిణీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లింగాల ధనలక్ష్మి, అంజసాహెబ్, పీసీ కమ్యూనిటీ మెంబర్స్ బి.శరత్‌బాబు, వి.రామదుర్గానాయక్, ఉపాధ్యాయులు అలీబాషా ఉన్నారు.

గంగవరంలో..

గురజాల: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు ప్రాధాన్యమిస్తూ పాలన అందిస్తున్నారని కో ఆప్షన్ సభ్యుడు షేక్ పీర్ అహ్మద్ అన్నారు. మండల పరిధిలోని గంగవరంలో జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ బుక్కిశెట్టి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయుడు నరసింహరావు తదితరులున్నారు.

పందిటివారిపాలెంలో..

పిడుగురాళ్ల రూరల్: విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు తాటికొండ చిన్న ఆంజనేయులురెడ్డి అన్నారు. మండలంలోని పందిటివారిపాలెంలోని నంద్యాల ఆంజనేయులురెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యా కానుకల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కోటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ, సుధాకర్ రెడ్డి, ఎస్ఎంసీ వైస్ చైర్మన్ ఏడుకొండలు, రంగారెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు

101 మందికి రూ.3.90 లక్షల అపరాధ రుసుం


రెంటచింతల అంబేద్కర్ కాలనీలో విద్యుత్ మీటర్‌ను తనిఖీ చేస్తున్న డీఈ హరిబాబు

రెంటచింతల: విద్యుత్ విజిలెన్స్ అధికారులు గురువారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. డీఈలో బి.విజయకృష్ణ, జే హరిబాబు ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. మండలంలోని రెంటచింతల, మల్లవరం, మంచికల్లు , పాలువాయి, పశర్లపాడు, సత్రశాల, తుమృకోట, గోలి గ్రామాలలో తనిఖీలు చేపట్టారు. మొత్తం 3,390 విద్యుత్ సర్వీసులను తనిఖీ చేసి అనుమతి లేకుండా అక్రమంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 101 మందికి రూ.3.90 లక్షల అపరాధ రుసుం విధించినట్లు ఏఈ షేక్ మస్తాన్‌వలి తెలిపారు. గ్రామాలలో విద్యుత్ చౌర్యానికి పాల్పడేవారిపై 9440812263, 9440812360, 9440812361 నంబర్లకు నేరుగా ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. తనిఖీలలో డీఈఈలు ఎం.రవికుమార్, కె.రవికుమార్, ఎం.శ్రీనివాసరావు, ఏఈలు కె.కోటేశ్వరరావు, ఏ చంద్రోఖర్ పాల్గొన్నారు.

ఎంసెట్‌లో సత్తా చాటిన కారెంపూడి విద్యార్థి


గర్నేడి వెంకటశైలేంద్రకుమార్, కారెంపూడి

కారెంపూడి: వైద్య విద్యనభ్యసించి డాక్టర్‌గా సేవలందించాలనేది తన కలని ఏపీఈఏపీసెట్‌లో 601 ర్యాంకు సాధించిన పల్నాడు జిల్లా కారెంపూడికి చెందిన విద్యార్థి గర్నేడి వెంకటశైలేంద్రకుమార్ తెలిపాడు. తండ్రి రోశయ్య కేబుల్ వర్కర్‌గా వ్యవసాయ కూలిగా పని చేస్తున్నారు. పెద్ద కుమారుడు ఐఐటీలో ర్యాంకు సాధించి ప్రస్తుతం వారణాసి ఐఐటీలో చదువుతున్నాడు. ప్రస్తుతం వెలువడిన ఏపీసెట్‌లో చిన్నకుమారుడు వెంకటశైలేంద్రకుమార్ కూడా మంచి ర్యాంకు సాధించి డాక్టర్ సీటు సాధించాడు. ఇదిలా ఉంటే గత రాత్రి వెలువడిన నీట్‌లో కూడా 622 ర్యాంకు సాధించాడు. టీఎస్ ఎంసెట్‌లో కూడా 303 ర్యాంకు సాధించడంతో శైలేంద్రకుమార్ తనకు నచ్చిన కాలేజీలో చేరే అవకాశాన్ని సొంతం చేసుకున్నాడు. ఈ సంతోషకరమైన వార్తతో రోశయ్య కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

విద్యతోనే అభివృద్ధి సాధ్యం

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల


విద్యార్థిని, తండ్రిని సత్కరిస్తున్న దృశ్యం

గురజాల: విద్యతోనే అభివృద్ధి సాధ్యమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని పల్లెగుంత ఏపీ మోడల్ స్కూల్‌లో గురువారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు తగిన ప్రాధాన్యమిస్తూ పాలన అందిస్తున్నారని కొనియాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తూ కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా నాడు- నేడు పనులతో రూపు రేఖలు మార్చారని వివరించారు.

అనంతరం ఇంటర్మీడియెట్ విద్యార్థులు నలుగురు, పదో తరగతి విద్యార్థులు ముగ్గురు విద్యార్థులకు మొదటి బహుమతి రూ.15 వేలు, ద్వితీయ బహుమతి రూ.10వేలు, తృతీయ బహుమతి రూ.5వేలుతో పాటు మోమెంటోతో పాటు విద్యార్థి తల్లిదండ్రులను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు, నగర పంచాయతీ చైర్ పర్సన్ పోలు పవన్మయి వీరారెడ్డి, రైల్వే బోర్డు డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్, డెప్యూటీ డీఈఓ వెంకటేశ్వరరావు, ఇన్‌చార్జి ఎంఈఓ శనగవరపు వెంకట ప్రసాద్, ప్రిన్సిపల్ సాంబశివరావు పాల్గొన్నారు.

జగనన్న ఆణిముత్యాలకు ఇద్దరు ఎంపిక


జి.నవ్యశ్రీ


జాస్మిన్

మాచవరం: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు అందించే జగనన్న ఆణిముత్యాలకు మాచవరం మండలానికి చెందిన ఇద్దరు విద్యార్థినులు గురజాల నియోజకవర్గ స్థాయిలో మొదటి, ద్వితీయ బహుమతుల అందుకున్నట్లు ఇన్‌చార్జి ఎంఈఓ ప్రసాద్ తెలిపారు. మండలంలోని మోర్జంపాడు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థిజి.నవ్యశ్రీ(ప్రథమ), మాచవరం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన షేక్ జాస్మిన్ ద్వితీయ బహుమతులు అందుకున్నారు. ఎంపికైన విద్యార్థులకు ఆయా పాఠశాల ఉపాధ్యాయులు, ఆయా గ్రామాల పెద్దలు విద్యార్థులను అభినందించారు.